# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

బుధవారం | 18 జూన్ 2025 | పేజీలు 8




# బడికి బాట చూపిన "హైడ్రాకు" ధన్యవాదాలు..

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం..

- ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ఆవేదనను గ్రహించిన హైడ్రా..
- మే 26న జీహెచ్ఎంసి జోనల్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయుల ప్లకార్డుల ప్రదర్శన..
- సీఎం సారూ "మా బడికి బాట వేయండి" అంటూ ముఖ్యమంత్రి విజ్ఞప్తికి..
- స్పందించిన "హైడ్రా కమిషనర్ రంగనాథ్" వెంటనే అడ్డంకులు తొలగింపు..
- బడికి బాట చూపిన హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌ను సన్మానించిన ఉపాధ్యాయులు..
- చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ధన్యవాదాలు..

-2 లో

# టీపీసీసీ చీఫ్‌కు.. కేటీఆర్ లీగల్ నోటీసులు..

## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఆరోపణలే ప్రధాన కారణం..

- తనపై మహేశ్ కుమార్ గౌడ్ చేసిన ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన కేటీఆర్..
- కేసీఆర్, కేటీఆర్ గతంలో ఫోన్లను ట్యాప్ చేశారన్న మహేశ్ కుమార్ గౌడ్..



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్..

హైదరాబాదు, పెన్ పవర్, జూన్ 17:తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు.. రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపణలు చేశారన్న కారణంతో కేటీఆర్ ఈ నోటీసులు పంపినట్లు తెలుస్తోంది.. కొంతకాలంగా తెలంగాణ రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. పలువురు రాజకీయ నాయకులు, అధికారుల పేర్లు ఈ కేసులో వినిపిస్తున్నాయి.. మంగళవారం మీడియా సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్ చేసినందుకు కేసీఆర్, కేటీఆర్ సిగ్గుతో తలదించుకోవాలని అన్నారు. చట్ట వ్యతిరేకంగా ఎంతోమంది ఫోన్లను ట్యాప్ చేశారని, సిట్ దర్యాప్తులో 650 మంది కాంగ్రెస్ నాయకుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు తెలిసిందని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలోనే కేటీఆర్ లీగల్ నోటీసులు పంపినట్టు తెలుస్తోంది.



# అక్రమ హోర్డింగ్‌లు..తక్షణమే తొలగించండి: ఆకుల సతీష్..

బాచుపల్లి చౌరస్తా నుంచి మల్లంపేట్ కమాన్ వరకు 5 భారీ హోర్డింగ్‌లు..

- మున్సిపల్ పర్మిషన్ లేకుండానే ఆర్ అండ్ బి అనుమతులతో హోర్డింగ్‌ల నిర్మాణం..
- ఆర్ అండ్ బి అనుమతులు, మున్సిపల్ పరిధిలో చెల్లవని సతీష్ ఆరోపణ..
- గత రెండేళ్ళుగా కొత్త హోర్డింగ్‌లకు పర్మిషన్ ఇవ్వకూడదని ప్రభుత్వ ఉత్తర్వులు..
- కొత్త పర్మిషన్‌లు, రెన్యువల్, చేయవద్దని గతేడాది మార్చి5న సర్క్యులర్ జారీ..

-3 లో



# జీహెచ్ఎంసీలో ఏసీబీ దాడులు

## ఏఈఈ స్వరూప లంచం తీసుకుంటుండగా అరెస్ట్

- పనుల కొలతల నమోదుకు కాంట్రాక్టర్ నుంచి రూ.1.20 లక్షల డిమాండ్
- బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు
- జీహెచ్ఎంసీ కార్యాలయంలో రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డ ఏఈఈ
- అవినీతి నిరోధక శాఖ అధికారుల అదుపులో స్వరూప

-4 లో

# తెలంగాణలో సమగ్ర గోసంరక్షణకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం

- రాష్ట్రంలో సమగ్ర గోసంరక్షణ విధానం రూపకల్పన
- వివిధ రాష్ట్రాల పద్ధతుల అధ్యయనానికి త్రిసభ్య కమిటీ
- నాలుగు ప్రాంతాల్లో అధునాతన గోశాలల నిర్మాణం
- కోడెల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచన
- గోసంరక్షణకు నిధుల కొరత ఉండదని సీఎం భరోసా

హైదరాబాద్ పెన్ పవర్:రాష్ట్రంలో గోవులను సంరక్షించేందుకు సమగ్రమైన విధానాన్ని రూపొందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందు కోసం ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న పద్ధతులను క్షుణ్ణంగా పరిశీలించేందుకు ముగ్గురు కీలక అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. మన సంస్కృతిలో గోవులకు ఉన్న విశిష్ట స్థానాన్ని, భక్తుల మనోభావాలను గౌరవిస్తూ,

-4 లో



ఉపాధ్యాయుల నిరసన నాటి ప్లకార్డ్..




- ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ఆవేదనను గ్రహించిన హైడ్రా..
- మే 26న జీహెచ్ఎంసి జోనల్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయుల ప్ల కార్డుల ప్రదర్శన..
- సీఎం సారూ “మా బడికి బాట వేయండి” అంటూ ముఖ్యమంత్రి విజ్ఞప్తికి..
- స్పందించిన “హైడ్రా కమిషనర్ రంగనాథ్” వెంటనే అడ్డంకులు తొలగింపు..
- బడికి బాట చూపిన హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌ను సన్మానించిన ఉపాధ్యాయులు..
- చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ధన్యవాదాలు..

హైడ్రా కమిషనర్‌ను కలిసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు..



# బడికి బాట చూపిన “హైడ్రాకు” ధన్యవాదాలు

## ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం..



హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్‌ను విద్యార్థులతో కలిసి సత్కరించిన హెడ్‌మాస్టర్..





బడి బాటకు అడ్డుగా ఉన్న గోడను తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది..



జీహెచ్ఎంసి జోనల్ కార్యాలయం ముందు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల నిరసన..ఫైల్‌ఫోటో..

**హైదరాబాదు, పెన్ పవర్, జూన్ 17:**మా బడికి బాట చూపారంటూ.. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కి సికింద్రాబాద్‌లోని మెట్టుగూడ డివిజన్ చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ రెడ్డి, ఉపాధ్యాయులు వెంకట రమణతో కలిసి వచ్చిన విద్యార్థులు మంగళవారం హైడ్రా కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి, శాలువాతో సత్కరించి మొక్కను బహూకరించారు.. గతనెల (మే 26న) తేదీన జీహెచ్ఎంసి జోనల్ కార్యాలయం ఎదుట ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు “మా బడికి బాట వేయించండి” అంటూ ప్ల కార్డు పట్టుకుని నిరసన తెలిపారు.. నిరసన కార్యక్రమాన్ని సోషల్ మీడియాలో చూసిన హైడ్రా రంగంలోకి దిగింది.. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ ఆదిత్య క్షేత్రస్థాయిలో పరిశీలించి.. పాఠశాలకు వెళ్లే మార్గంలో అడ్డంగా ఉన్న ప్రహరీని తొలగించి “బడికి బాట చూపారు.. వెంటనే జీహెచ్ఎంసి సహకారంతో రోడ్డు వేయించి.. పాఠశాలకు రక్షణగా గేటు కూడా పెట్టించారు.. పాఠశాలలో విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు.. హైడ్రాను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జై కొట్టారు.. మంగళవారం నేరుగా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.. మీరంతా బాగా చదువుకోవాలని కమిషనర్ చెప్పగానే అందరూ ముక్తకంఠంతో ఓకే సార్ అంటూ బదులిచ్చారు.. పాఠశాలకు రోడ్డు వేయించి గేటు పెట్టించిన జీహెచ్ఎంసి జోనల్ కమిషనర్ రవికిరణ్‌కి కూడా విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.


బాచుపల్లిలో నూతన హోర్డింగ్‌ల వద్ద ఆకుల సతీష్ టీమ్..

# అక్రమ హోర్డింగ్‌లు...
# తక్షణమే తొలగించండి : ఆకుల సతీష్

## బాచుపల్లి చౌరస్తా నుంచి మల్లంపేట్ కమాన్ వరకు 5 భారీ హోర్డింగ్‌లు..




- మున్సిపల్ పర్మిషన్ లేకుండానే ఆర్ అండ్ బి అనుమతులతో హోర్డింగ్‌ల నిర్మాణం..
- ఆర్ అండ్ బి అనుమతులు, మున్సిపల్ పరిధిలో చెల్లవని సతీష్ ఆరోపణ..
- గత రెండేళ్ళుగా కొత్త హోర్డింగ్‌లకు పర్మిషన్ ఇవ్వకూడదని ప్రభుత్వ ఉత్తర్వులు..
- కొత్త పర్మిషన్‌లు, రెన్యువల్, చేయవద్దని గతేడాది మార్చి5న సర్క్యులర్ జారీ..




కొత్తగా నిర్మించిన అక్రమ హోర్డింగ్‌లు..

**దుండిగల్, పెన్ పవర్, జూన్ 17:** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ హోర్డింగ్‌లను తక్షణమే తొలగించాలని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆరోపించారు..బాచుపల్లి చౌరస్తా నుంచి మల్లంపేట కమాన్ వరకి ఐదు భారీ హోర్డింగ్‌ల నిర్మాణాలు మున్సిపల్ అనుమతులు లేకుండా ఏ విధంగా నిర్మాణం చేశారని ప్రశ్నించారు.. సంబంధిత అక్రమ హోర్డింగ్‌లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.. కేవలం "ఆర్ అండ్ బి" అనుమతులు మాత్రమే తీసుకుంటే చెల్లదని అన్నారు..మున్సిపల్ కార్పొరేషన్‌కి పన్ను చెల్లించి అనుమతులు తీసుకోవాలని తెలిపారు.. గత రెండేళ్ళుగా నూతన హోర్డింగ్‌లకు పర్మిషన్ ఇవ్వొద్దని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు ఉన్నప్పటికీ..! స్థానిక అధికారపార్టీ నేతల అండతో, కొత్త హోర్డింగ్‌లు వెలుస్తున్నాయని సతీష్ ఆరోపించారు.. మరోవైపు స్థానిక సంస్థల పరిధిలోని కొత్త హోర్డింగ్‌లకు గాని, పాతవాటికి రెన్యువల్ చేయడం, నిలిపి వేయాలని 2024 మార్చి 5న సిడిఎంఏ నుంచి మున్సిపాలిటీలకు, కార్పొరేషన్‌లకు సర్క్యులర్ జారీ చేసినట్టు సతీష్ గుర్తు చేశారు.. హోర్డింగ్‌ల ద్వారా స్థానిక సంస్థలకు వచ్చే ఆదాయం తక్కువగా ఉన్నందున వాటిని సవరించాల్సి ఉన్నదని, అందుకే అనుమతులు పొందిన హోర్డింగ్‌లకు రెన్యువల్ చేయొద్దని ఆదేశాలు ఉన్నట్టు ఆకుల సతీష్ పేర్కొన్నారు.

# ఎయిర్ ఇండియా ఫ్లైట్ క్రాష్ కొత్త వీడియో.. ఓ పక్క మంటలు..భయంతో భవనంపైనుంచి దుంకుతున్న మెడికోలు..

హైదరాబాద్ పెన్ పవర్:దేశం మొత్తాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిన విషాద ఘటన అహ్మదాబాద్ విమాన ప్రమాదం..అహ్మదాబాద్ ఎయిర్ పోర్టు సమీపంలో ఎయిర్ ఇండియా విమానం ఓ మెడికల్ కాలేజీ హాస్టల్ భవనంపై కూలి 280 మంది చనిపోయిన విషయం తెలిసిందే.. ఘటన జరిగిన ఐదు రోజుల తర్వాత సోమవారం (జూన్ 17) కాలేజీహాస్టల్ భవనంపై విమానం కూలిన భయంకరదృశ్యాలు, మెడికోలు ప్రాణాలు కాపాడుకునేందుకు భవనం పైనుంచి దుంకిన వీడియోలు బయటికి వచ్చాయి.

అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం జరిగిన కొన్ని రోజుల తర్వాత బీజే మెడికల్ కాలేజీ విద్యార్థులు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి హాస్టల్ గదుల నుండి తప్పించుకుంటున్నట్లు చూపించే కొత్త వీడియో వెలుగులోకి వచ్చింది. వైద్య విద్యార్థులు తమ హాస్టల్‌లోని రెండు , మూడో అంతస్తులనుంచి బెడ్‌షీట్‌ల సహాయంతో బాల్కనీల నుంచి దుంకుతున్నట్లు వీడియోల కనిపిస్తోంది.



బీజే కాలేజీ హాస్టల్ భవనాల్లో ఒకదానిలోకి విమానం దూసుకుపోయింది..ప్రమాదంలో ఇంధనం అంటుకొని పెద్ద ఎత్తున మంటలు లేచి పక్కన ఉన్న చెట్లు, భవనాలకు కూడా మంటలంటుకున్నాయి. ఈ క్రమంలో భవనాల్లో ఉన్న విద్యార్థులు తప్పించుకునేందుకు రెండు మూడు అంతస్థులనుంచి బెడ్ షీట్లు కట్టి కిందకు దూకారు.

ఘటన జరిగిన 5 రోజుల తర్వాత ఈ వీడియో విడుదలయ్యాయింది. భవనంలో ఓ పక్క మంటలు చెలరేగుతున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. మంటల్లో చిక్కుకున్నవారి ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి.

ఎయిర్ ఇండియా విమానం బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ భవనంపై కూలడంతో 54 మంది మెడికోలు, సిబ్బంది మృతిచెందారు. అనేక మంది గాయపడ్డారు. విమానంలో ప్రయాణిస్తున్న 242 మందిలో ఒకే ఒక్కడు ప్రాణాలతో బయటపడ్డారు.

ప్రమాదానికి గురైన విమానంలో అనుభవజ్ఞులైన పైలట్లు ఉన్నప్పటికీ విమానం టేకాఫ్ అయిన నిమిషాల్లో కూలిపోవడం మిస్టరీగా మారింది. దాదాపు 10వేల గంటలు నడిపిన అనుభవం ఉన్న కెప్టెన్ సుమీత్ సభర్వాల్, 11వందల గంటల అనుభవం ఉన్న కో పైలట్ క్లైవ్ కుందర్ పైలట్లుగా ఉన్నారు. వారు కూడా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.

ప్రమాదానికి గల కారణాలు తెలియజేసే కీలక ఆధారం బ్లాక్ బాక్స్ ను ఇప్పటికే దర్యాప్తు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని విశ్లేషిస్తే గానీ ప్రమాం ఎలా జరిగింది. ఎందుకు జరిగింది అనే విషయాలు బయటికి రానున్నాయి.

# ఇరాన్ గురిచూసి కొడుతోందా..? ఇంటెలిజెన్స్ ఏజెన్సీ మొస్సాద్ హెడ్ క్వార్టర్స్‌పై దాడి..!



హైదరాబాద్ పెన్ పవర్:ప్రపంచంలో శక్తివంతమైన ఇంటెలిజెన్స్ ఏజెన్సీల విషయానికి వస్తే అందులో మొస్సాద్ పేరు టాప్ లిస్టులోనే ఉంటుంది. శత్రువుకు కూడా అనుమానం రాకుండా టార్గెట్లను ఫినిష్ చేసి రాగలిగే శక్తి ఆ సంస్థకు ఉంది. ఇజ్రాయెల్ తన చుట్టూ శత్రుదేశాలు ఉన్నప్పటికీ మనుగడను కొనసాగించగలుగుతోందంటే దీని అత్యుత్తమ పనితీరేనని యుద్ధ నిపుణులు చెబుతుంటారు. పైగా రక్షణ విషయానికి వస్తే అమెరికా ఇప్పుడు గోల్డెన్ డోమ్ అంటుంటే.. ఇజ్రాయెల్ ఎప్పుడో ఐరన్ డోమ్ అంటూ గగనతల దాడులను అరికట్టేందుకు రక్షణ వ్యవస్థను సిద్ధం చేసుకుంది.

అయితే ప్రస్తుతం కొనసాగుతున్న ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధ వాతావరణంలో రెండు దేశాలు భీకర దాడులకు వెళుతున్నాయి. ఈసారి చూస్తే ఇజ్రాయెల్ లోని అనేక ప్రాంతాలపై ఇరాన్ మిస్సైల్స్ ప్రభావాన్ని చూపుతున్నాయి. తాజాగా టెల్ అవివ్ లోని ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ మొస్సాద్ హెడ్ క్వార్ట్స్ పై ఇరాన్ దాడి చేసినట్లు ఇరాన్ స్టేట్ టెలివిజన్ నివేదించింది. తాము ఇజ్రాయెల్ లోని కీలక ప్రదేశాలపై విజయవంతంగా దాడులు చేసినట్లు ఇస్లామిక్ రెవల్యూషినరీ గార్డ్ కార్ప్స్ నేడు ప్రకటించింది.

ఇజ్రాయెల్ మిలిటరీ ఇంటెలిజెన్స్ హబ్ అమన్ పై తాము దాడులు చేసినట్లు ఇరాన్ చెబుతోంది. అయితే మొస్సాద్ కేంద్రం మంటల్లో దగ్ధమౌతున్న వీడియో దానికి సాక్ష్యం అంటూ ఇరాన్ మీడియా చెబుతోంది. సెంట్రల్ టెహ్రాన్‌లోని ఒక కమాండ్ సెంటర్‌పై రాత్రిపూట జరిగిన వైమానిక దాడిలో ఇరాన్ సీనియర్ కమాండర్ అలీ షమ్దానీని హతమార్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించిన కొన్ని గంటల తర్వాత మొస్సాద్ కాంపౌండ్‌పై దాడులు జరిగాయి. అయితే మరో పక్క ఇజ్రాయెల్ మాత్రం ఇరాన్ మౌలిక సదుపాయాలు, డ్రోన్ సైట్స్, లాంట్ ఫ్లాట్ ఫారమ్ లు, స్టోరేజ్ డిపోలను టార్గెట్ చేసి దాడులను కొనసాగిస్తోంది. దీంతో శుక్రవారం నుంచి రెండు దేశాల మధ్య బాంబుల మోత మోగుతోంది.

# జీహెచ్ఎంసీలో ఏసీబీ దాడులు: ఏఈఈ స్వరూప లంచం తీసుకుంటుండగా అరెస్ట్

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ నగరంలో అవినీతి అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా, కాప్రా జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఒక అధికారిణి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.కాప్రా సర్కిల్ పరిధిలో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈఈ)గా పనిచేస్తున్న బి. స్వరూప, ఒక కాంట్రాక్టర్ పూర్తి చేసిన పనులకు సంబంధించిన కొలతలను ఎం-బుక్ లో నమోదు చేయడానికి రూ. 1,20,000 లంచం డిమాండ్ చేశారు. దీంతో ఆ కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.బాధిత కాంట్రాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో కాప్రాలోని జీహెచ్ఎంసీ కార్యాలయంపై మంగళవారం దాడి చేశారు. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం, కాంట్రాక్టర్ నుంచి ఏఈఈ స్వరూప రూ. 1,20,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆమెను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. లంచంగా స్వీకరించిన నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏఈఈ స్వరూపను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు, ఆమెపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణలో సమగ్ర గోసంరక్షణకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం

- మొదటి పేజీ తరువాయి

గోసంరక్షణే ప్రధాన లక్ష్యంగా ఈ పాలసీ ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

మంగళవారం తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గోసంరక్షణ అంశంపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సరైన వసతి, స్థలం లేకపోవడం వంటి కారణాలతో గోవులు తరచూ మృత్యువాత పడుతుండటం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని నివారించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.గోసంరక్షణ విధాన రూపకల్పన కోసం పశుసంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావులతో కూడిన కమిటీని నియమించారు. ఈ కమిటీ ఇతర రాష్ట్రాల్లోని గోసంరక్షణ విధానాలను అధ్యయనం చేసి, మన రాష్ట్రానికి అనువైన సూచనలతో నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు.

తొలిదశలో భాగంగా రాష్ట్రంలోని నాలుగు కీలక ప్రాంతాల్లో అన్ని హంగులతో కూడిన ఆధునిక గోశాలలను నిర్మించాలని ముఖ్యమంత్రి సూచించారు. వేములవాడ, యాదగిరిగుట్ట, హైదరాబాద్ నగర శివారులోని ఎనికేపల్లి, పశు విశ్వవిద్యాలయం సమీపంలో విశాలమైన ప్రాంగణాల్లో ఈ గోశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా వేములవాడ సమీపంలో కనీసం వంద ఎకరాల విస్తీర్ణంలో గోశాల ఉండాలని ఆయన స్పష్టం చేశారు. భక్తులు మొక్కుబడిగా సమర్పించే కోడెలను కూడా ప్రత్యేక శ్రద్ధతో సంరక్షించాలని తెలిపారు. గోసంరక్షణ కోసం ఎంత ఖర్చయినా ప్రభుత్వం వెనుకాడబోదని సీఎం హామీ ఇచ్చారు.

# ఎయిరిండియా విమానం కూలిపోవడానికి ప్రధాన కారణం ఇదేనా?

- అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాదం, 274 మంది మృతి
- విమానం రెండు ఇంజన్లు లేదా విద్యుత్, హైడ్రాలిక్ వ్యవస్థలు విఫలమైనట్లు కొత్త ఆధారాలు
- అత్యవసర 'ర్యామ్ ఎయిర్ టర్బైన్' (ఆర్‌ఏటీ) పనిచేసినట్లు వెల్లడి
- టేకాఫ్ అయిన 32 సెకన్లకే కూలిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8
- పక్షులు ఢీకొన్నాయన్న వాదనను తోసిపుచ్చిన నిపుణులు



**హైదరాబాద్ పెన్ పవర్:**అహ్మదాబాద్‌లో గత వారం జరిగిన ఘోర ఎయిరిండియా విమాన ప్రమాద దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. జూన్ 12న టేకాఫ్ అయిన 32 సెకన్లకే బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానం కుప్పకూలి 270 మందికి పైగా మరణించిన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనకు రెండు ఇంజన్లు ఒకేసారి విఫలమవడం లేదా విద్యుత్, హైడ్రాలిక్ వ్యవస్థలు పూర్తిగా మొరాయించడమే కారణమని తాజా ఆధారాలు సూచిస్తున్నాయి. ప్రమాద సమయంలో విమానంలో 'ర్యామ్ ఎయిర్ టర్బైన్' (ఆర్‌ఏటీ) పనిచేసినట్లు ఆడియో, వీడియో ఫుటేజీల ద్వారా స్పష్టమైంది. రెండు ఇంజన్లు లేదా విద్యుత్, హైడ్రాలిక్ వ్యవస్థలు విఫలమైనప్పుడు ఆర్‌ఏటీ అత్యవసర విద్యుత్‌ను అందిస్తుంది. ఇంజన్ల శబ్దం లేకపోవడం, ఆర్‌ఏటీ పనిచేస్తోందన్న దానికి సూచనగా ప్రత్యేక శబ్దం వినిపించడం, విమానం గాల్లో నిలదొక్కుకోలేకపోవడం వంటివి దీనికి బలం చేకూరుస్తున్నాయి. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన వ్యక్తి కూడా ఆర్‌ఏటీ యాక్టివేట్ అయిన శబ్దం విని, అత్యవసర లైట్లు వెలిగినట్లు చెప్పడం గమనార్హం.

భారత వైమానిక దళ పైలట్, విమానయాన నిపుణుడు కెప్టెన్ ఎహసాన్ ఖలీద్ మాట్లాడుతూ, "రెండు ఇంజన్లు ఒకేసారి విఫలమై ఉంటాయని వీడియో చూసినప్పుడే అనుమానించాను. పక్షులు ఢీకొట్టడం దాదాపు అసాధ్యం. ఇంజన్లు డిజిటల్‌గా, కచ్చితంగా ఒకేసారి ఆగిపోయాయంటే అది సాఫ్ట్‌వేర్ లోపం లేదా సెన్సార్ల తప్పుడు సిగ్నల్ వల్లే జరిగి ఉండాలి. ఇది విద్యుత్ వైఫల్యం వల్ల సంభవించవచ్చు" అని విశ్లేషించారు.

ఎయిర్‌స్పేస్ ప్రొఫెసర్ డాక్టర్ ఆదిత్య పరాంజపే కూడా రెండు ఇంజన్లు ఏకకాలంలో థ్రస్ట్ (ముందుకు నెట్టే శక్తి) కోల్పోయాయని ప్రాథమిక ఆధారాలు సూచిస్తున్నాయన్నారు. ఒక ఇంజన్ విఫలమైతే సాధారణంగా కనిపించే 'యాయింగ్' (విమానం అటూఇటూ తిరగడం) ఈ ఘటనలో లేదని, ఇది రెండు ఇంజన్లు ఏకకాలంలో దెబ్బతిన్నాయనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ నూతన ఆధారాలతో ప్రమాద కారణాలపై దర్యాప్తు మరింత లోతుగా సాగుతోంది.

**ఆర్‌ఏటీ పనితీరు - కీలక ఆధారాలు**

ప్రమాదానికి సంబంధించిన ఆడియో, వీడియో ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించగా, విమానంలో 'ర్యామ్ ఎయిర్ టర్బైన్' (ఆర్‌ఏటీ) పనిచేసినట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయి. ఆర్‌ఏటీ అనేది ఒక చిన్న ప్రొపెల్లర్ వంటి పరికరం. విమానానికి చెందిన రెండు ఇంజన్లు పనిచేయకపోయినా లేదా విద్యుత్, హైడ్రాలిక్ వ్యవస్థలు పూర్తిగా మొరాయించినా ఇది అత్యవసర పరిస్థితుల్లో దానంతట అదే క్రియాశీలమవుతుంది. ప్రమాద సమయంలో విమానం ఇంజన్ల నుంచి ఎటువంటి భారీ శబ్దం రాలేదని, ఆర్‌ఏటీ పనిచేస్తున్నప్పుడు వెలువడే ప్రత్యేకమైన పెద్ద శబ్దం మాత్రం ఆడియో రికార్డింగ్‌లో స్పష్టంగా వినిపించిందని నిపుణులు గుర్తించారు.

అంతేకాకుండా, విమానం గాల్లో ఎత్తును నిలబెట్టుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతూ, వేగంగా కిందకు పడిపోతున్న దృశ్యాలు వీడియోలో నమోదయ్యాయి. గాలి వేగాన్ని ఉపయోగించుకుని అత్యవసర

విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ఆర్‌ఏటీ పనిచేసిందంటే, విమానంలోని రెండు ఇంజన్లు ఆగిపోయి ఉండటం, లేదా విద్యుత్ వ్యవస్థ పూర్తిగా విఫలం కావడం, లేదా హైడ్రాలిక్ వ్యవస్థ మొరాయించడం వంటి మూడు ప్రధాన కారణాల్లో ఒకటి జరిగి ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

మొదట, పక్షులు ఢీకొనడం వల్లే ప్రమాదం జరిగిందని అనుమానించినప్పటికీ, రన్‌వేపై పక్షుల కళేబరాలు ఏవీ లభించకపోవడం, అందుబాటులో ఉన్న రెండు వీడియోల్లోనూ ఇంజన్ల వద్ద మంటలు, నిప్పురవ్వలు, పొగ లేదా శకలాలు కనిపించకపోవడంతో ఆ వాదనను ఇప్పుడు తోసిపుచ్చారు.


# రన్నింగ్ బైక్‌పై ప్రేమజంట రొమాన్స్.. దిమ్మతిరిగే షాకిచ్చిన ట్రాఫిక్ పోలీసులు



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రేమ జంటల పబ్లిక్ రొమాన్స్ ఘటనలు ఈమధ్యకాలంలో బాగా పెరిగిపోయాయి. చుట్టూ జనం ఉన్నారు..నడిరోడ్డుపై వాహనంపై వెళ్తున్నామనే సోయి లేకుండా ప్రవర్తిస్తున్నారు.పబ్లిక్ గానే హద్దులు మీరి గాల్లో తేలుతూ ముద్దుల వర్షం కురిపిస్తున్నారు. బైకులు, కార్లలో వెళ్తూ అందరూ చూస్తున్నా సిగ్గులేకుండా అదేదో ఫ్యాషన్ అన్నట్లుగా బహిరంగంగానే రొమాన్స్ చేస్తూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. అయితే ఇలాంటి చూస్తే ట్రాఫిక్ పోలీసులు ఊరుకుంటారా.. ఇలా చేసిన వారికి దిమ్మతిరిగే షాక్ ఇస్తున్నారు. తాజాగా యూపీలోని నోయిడాలో కూడా బైక్ పై వెళ్తూ పబ్లిక్ రొమాన్స్ చేస్తున్న జంటకు అదే చేశారు ట్రాఫిక్ పోలీసులు. నోయిడా హైవేపై ఓ జంట పబ్లిక్ గానే బైక్ పై రొమాన్స్ చేస్తూ రెచ్చిపోయారు. యువకుడు బైక్ నడుపుతుండగా..యువతి ముందు పెట్రోల్ ట్యాంక్ పై కూర్చొని హగ్ చేసుకొని అతని ముఖంపై ముద్దుల వర్షం కురిపిస్తోంది.. అలా బహిరంగంగా రొమాన్స్ చేస్తున్న వారికి బాగానే ఉన్నా.. చూస్తున్న ఇతర వాహనదారులకు కొంచెం జుగుప్స కలిగించింది. దీంతో పబ్లిక్ రొమాన్స్ సీన్లను కెమెరాల్లో బంధించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ వీడియో వైరల్ కావడంతో నోయిడా పోలీసులకు చేరింది. ఇంకేముంది వీళ్లకు తగిన బుద్ధి చెప్పాల్సిందే అనుకున్నారు పోలీసులు. నోయిడా హైవేపై బైక్ రొమాన్స్ వీడియో ట్రాఫిక్ పోలీసులకు చేరడంతో చర్యలకు రెడీ అయ్యారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించినందుకు, తోటి వాహనదారులకు ఇబ్బంది కలిగించినందుకు భారీ జరిమానా విధించారు. ఏకంగా 53వేల 500 రూపాయల ఫైన్ వేశారు. బైక్ సీజ్ చేశారు. ఇక వైరల్ అవుతున్న బైక్ రొమాన్స్ వీడియోపై నెటిజన్లనుంచి మిశ్రమ స్పందనలు వచ్చాయి. కొంతమంది పబ్లిక్ రొమాన్స జంటకు సపోర్టు చేస్తూ.. ఇంత జరిమానా వేస్తారా.. ఇదెక్కడి అన్యాయం అన్నట్లు రాశారు. ఏ రూల్ ప్రకారం ఇంత ఫైన్ వేశారు అని ట్రాఫిక్ పోలీసులను ప్రశ్నించే ప్రయత్నం చేశారు. ఫైన్ సంగతి ఎలా ఉన్నా.. పబ్లిక్ లో రొమాన్స్ ఏంటమ్మా.. అని మరికొందరు నెటిజన్లు స్పందించారు.

# ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు: తెలంగాణ పౌరుల కోసం ప్రభుత్వ హెల్ప్‌లైన్!

- ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్త పరిస్థితులపై తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తం
- ఆయా దేశాల్లోని తెలంగాణ పౌరుల సహాయార్థం ఢిల్లీ తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్లు
- అత్యవసర సహాయం కోసం నలుగురు అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు విడుదల



**హైదరాబాద్ పెన్ పవర్:**పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, ఆయా దేశాలలో నివసిస్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన పౌరుల భద్రత, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. వారికి ఎలాంటి అత్యవసర సహాయం అవసరమైనా సంప్రదించేందుకు వీలుగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు.ప్రస్తుత క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నలుగురు కీలక అధికారులను ప్రత్యేకంగా నియమించింది. వారి ఫోన్ నంబర్లను కూడా ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసింది.అత్యవసర పరిస్థితుల్లో లేదా ఏదైనా సమాచారం కోసం తెలంగాణ పౌరులు సంప్రదించాల్సిన అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి... వందన, ఐఏఎస్ (పీఎస్, రెసిడెంట్ కమిషనర్): 091 9871999044, రక్షిత్ నాయక్ (లైజన్ ఆఫీసర్): 091 9643723157, జావేద్ హుస్సేన్ (లైజన్ ఆఫీసర్): 091 9910014749, సీహెచ్ చక్రవర్తి (పౌర సంబంధాల అధికారి): 091 9949351270 నెంబర్లలో సంప్రదించాలని సూచించింది.

# పెళ్లికి ముందు రోజు వరుడి హత్య... పరారీలో పెళ్లికూతురు!

- ఉత్తర్ ప్రదేశ్ రాంపూర్‌లో వరుడి దారుణ హత్య
- వధువు, ఆమె ప్రియుడే హత్య చేయించినట్లు పోలీసుల ప్రాథమిక నిర్ధారణ
- జూన్ 15న వివాహం జరగాల్సి ఉండగా నిహాల్ అనే వ్యక్తి హతం
- ప్రధాన నిందితుడు సద్దాం అరెస్ట్, వధువు గుల్ఫాషా పరారీ




**హైదరాబాద్ పెన్ పవర్:**ఉత్తర్ ప్రదేశ్‌లో తీవ్ర కలకలం రేపిన ఘటనలో, మరికొన్ని గంటల్లో పెళ్లిపీటలెక్కాల్సిన వరుడు దారుణ హత్యకు గురయ్యాడు. కాబోయే భార్యకు ఉన్న ప్రేమ వ్యవహారమే ఈ హత్యకు దారితీసిందని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ దారుణ సంఘటన రాంపూర్ జిల్లాలో చోటుచేసుకుంది. ఇటీవల మేఘాలయలో హనీమూన్ పేరుతో భర్తను భార్య హత్య చేయించిన ఘటన మరువక ముందే, ఉత్తర్ ప్రదేశ్‌లో జరిగిన ఈ ఉదంతం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది.

రాంపూర్‌కు చెందిన నిహాల్ (35) అనే యువకుడికి జూన్ 15వ తేదీన వివాహం జరగాల్సి ఉండగా, ముందు రోజు రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. నిహాల్ వివాహాలు, ఇతర శుభకార్యాలకు వంటమనిషిగా పనిచేస్తుంటాడు. భోట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధనుపుర గ్రామానికి చెందిన గుల్ఫాషాతో నిహాల్‌కు నాలుగు నెలల క్రితం వివాహం నిశ్చయమైంది. జూన్ 15న పెళ్లి జరగాల్సి ఉండగా, ఇంట్లో పెళ్లి పనులు జరుగుతున్నాయి.


ఈ క్రమంలో, జూన్ 14వ తేదీ రాత్రి, వధువు బంధువునంటూ ఒక వ్యక్తి నిహాల్‌కు ఫోన్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ ఫోన్ కాల్ తర్వాత నిహాల్ ఇద్దరు వ్యక్తులతో కలిసి బయటకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అతని కోసం గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ హత్య వెనుక వధువు గుల్ఫాషా, ఆమె ప్రియుడు సద్దాం (32) హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. గుల్ఫాషా తన పొరుగింటికి చెందిన సద్దాంతో గత ఏడాది కాలంగా ప్రేమ వ్యవహారం నడుపుతోందని పోలీసులు వెల్లడించారు. నిహాల్‌తో పెళ్లి ఇష్టం లేని గుల్ఫాషా, ప్రియుడు సద్దాం, అతని స్నేహితులతో కలిసి నిహాల్ హత్యకు కుట్ర పన్నినట్లు అనుమానిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు సద్దాం, అతని అనుచరులు ఫర్మాన్, అనీస్‌లపై కేసు నమోదు చేశారు.

ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడైన సద్దాంను సోమవారం (జూన్ 16) అరెస్ట్ చేసినట్లు రాంపూర్ పోలీసులు తెలిపారు. హత్యకు గురైన నిహాల్ మొబైల్ ఫోన్‌ను తాను దాచిపెట్టినట్లు సద్దాం పోలీసుల విచారణలో అంగీకరించాడు. అనంతరం, కొత్వాలి గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిహాల్ మొబైల్‌ను స్వాధీనం చేసుకునే క్రమంలో, సద్దాం పోలీసుల వద్ద నుంచి తుపాకీ లాక్కుని పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు ఆత్మరక్షణ కోసం జరిపిన కాల్పుల్లో సద్దాం గాయపడ్డాడు. ప్రస్తుతం అతడు పోలీసుల అదుపులో ఉన్నాడు.

ఈ హత్య కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న వధువు గుల్ఫాషా, మరో ఇద్దరు నిందితులు ఫర్మాన్, అనీస్‌లు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలకు గురిచేసింది.

# ఆన్‌లైన్ షాపింగ్ ఆఫర్లు, పబ్లిక్ వైఫై ద్వారా ఆర్థిక లావాదేవీలు: హైదరాబాద్ సైబర్ క్రైమ్ హెచ్చరిక

- క్రిప్టో పెట్టుబడులపై భారీ లాభాల ఆశ వద్దు, డబ్బు రెట్టింపు అవుతుందంటే నమ్మొద్దు
- నకిలీ స్క్రీన్‌షాట్‌లతో వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో మోసపూరిత పెట్టుబడి పథకాలు
- తక్కువ ధరలంటూ సోషల్ మీడియా లింకులతో ఫేక్ ఈ-కామర్స్ సైట్ల పట్ల జాగ్రత్త
- తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు ఆశ చూపే ట్రేడింగ్ టిప్స్‌కు దూరంగా ఉండాలి
- పబ్లిక్ వైఫైలో ఆర్థిక లావాదేవీలు చేయొద్దు, క్యూఆర్ కోడ్ స్కాన్‌లో అప్రమత్తత అవసరం




**హైదరాబాద్ పెన్ పవర్:**మారుతున్న కాలంతో పాటు మోసాలు తీరు కూడా మారుతోంది. ఆన్‌లైన్ వేదికగా సైబర్ నేరగాళ్లు అమాయకులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. క్రిప్టో కరెన్సీ పెట్టుబడులు, ఆన్‌లైన్ షాపింగ్ ఆఫర్లు, సోషల్ మీడియాలో ట్రేడింగ్ టిప్స్ వంటి వివిధ మార్గాల్లో ప్రజలను ఆకర్షించి, వారి డబ్బును దోచుకుంటున్నారు. ఇటువంటి మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ హైదరాబాద్ పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా వరుస ట్వీట్లు చేశారు.

### క్రిప్టో కరెన్సీ మోసాలు

క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే కొద్ది రోజుల్లోనే భారీగా లాభాలు వస్తాయని, పెట్టిన డబ్బు రెట్టింపు అవుతుందని చెప్పే మాటలను అస్సలు నమ్మవద్దని హెచ్చరించారు. మోసగాళ్లు వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో గ్రూపులు సృష్టించి, నకిలీ లావాదేవీల స్క్రీన్‌షాట్‌లను షేర్ చేస్తూ నమ్మించే ప్రయత్నం చేస్తారు. ఇటువంటి వాటిని చూసి ఆశపడి పెట్టుబడులు పెడితే నష్టపోవడం ఖాయమని హెచ్చరిస్తూ 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు.

### ఆన్‌లైన్ షాపింగ్ వంచన

మార్కెట్ ధర కంటే చాలా తక్కువ ధరకే వస్తువులు లభిస్తున్నాయని సామాజిక మాధ్యమాల్లో కనిపించే ఆకర్షణీయమైన ప్రకటనలు, లింకులను గుడ్డిగా క్లిక్ చేయవద్దని సూచించారు. ప్రముఖ ఈ-కామర్స్ సంస్థల వెబ్‌సైట్లను పోలి ఉండేలా నకిలీ వెబ్‌సైట్లను సృష్టించి మోసాలకు పాల్పడుతున్నారని, అందువల్ల ఆన్‌లైన్‌లో ఏదైనా కొనుగోలు చేసే ముందు వెబ్‌సైట్ అసలైనదో కాదో క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని హితవు పలికారు.

### సామాజిక మాధ్యమం ద్వారా పెట్టుబడి సలహాలు

సామాజిక మాధ్యమ వేదికల్లో కనిపించే పెట్టుబడి సలహాలను గుడ్డిగా నమ్మడం ప్రమాదకరమని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశ మిమ్మల్ని చిక్కుల్లో పడేయొచ్చని, ముఖ్యంగా వాట్సాప్, టెలిగ్రామ్‌లలో షేర్ అయ్యే ట్రేడింగ్ టిప్స్, పెట్టుబడి పథకాలకు దూరంగా ఉండటం మంచిదని సూచించారు.

### పబ్లిక్ వైఫై వినియోగంలో జాగ్రత్తలు

బహిరంగ ప్రదేశాల్లో లభించే ఉచిత వైఫై నెట్‌వర్క్‌లను వినియోగించేటప్పుడు ఆర్థిక లావాదేవీలు చేయడం సురక్షితం కాదని హెచ్చరించారు. ముఖ్యంగా రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఉచిత వైఫై కోసం క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయాల్సి వస్తే, అది నమ్మకమైన సోర్స్ నుంచి వచ్చిందో లేదో నిర్ధారించుకోవాలని, సైబర్ నేరగాళ్లు నకిలీ వైఫై హాట్‌స్పాట్‌లను ఏర్పాటు చేసి మీ వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని తస్కరించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పబ్లిక్ వైఫై వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# కిషన్ రెడ్డి అపాయింట్‌మెంట్ కోరిన ఎమ్మెల్యే రాజాసింగ్

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ అభ్యర్థన
- సమస్యలు వివరించేందుకు సమయం కేటాయించాలని విజ్ఞప్తి
- ఎక్కడ, ఎప్పుడు కలవాలో నిర్ణయిస్తే వస్తానన్న రాజాసింగ్
- తెలంగాణకు బీజేపీ ప్రభుత్వం అవసరమని వ్యాఖ్య
- వ్యక్తిగత విభేదాలు వీడి ఐక్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు



హైదరాబాద్ పెన్ పవర్:గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డితో వ్యక్తిగతంగా సమావేశమయ్యేందుకు అవకాశం కోరారు. కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లాలని భావిస్తున్నందున, వ్యక్తిగతంగా కలిసేందుకు సమయం ఇవ్వాలని రాజాసింగ్ మంగళవారం విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎక్కడ, ఎప్పుడు అందుబాటులో ఉంటారో తెలియజేస్తే, తాను అక్కడికే వచ్చి కలుస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రానికి బీజేపీ ప్రభుత్వం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత విభేదాలను పక్కనబెట్టి, రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడానికి ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందరూ సమష్టిగా పనిచేస్తేనే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# వివాదం : రజినీకాంత్.. విజయ్.. ఇంతకీ ఎవరు గొప్ప?



హైదరాబాద్ పెన్ పవర్:తమిళనాడు రాజకీయాలు ఎప్పుడూ సినీ గ్లామర్‌తో ముడిపడి ఉంటాయి. తాజాగా నటుడు విజయ్ రాజకీయ ప్రవేశంతో ఈ చర్చ మళ్ళీ తెరపైకి వచ్చింది. 'రజనీకాంత్ కంటే విజయ్ ఎందులో గొప్ప?' అనే ప్రశ్న ఇప్పుడు తమిళ రాజకీయ వర్గాల్లో, ప్రజల్లో విస్తృతంగా చర్చనీయాంశంగా మారింది.

**విజయ్ రాజకీయ అరంగేట్రం, అభిమానుల ఆశలు**

నటుడు విజయ్ 'తమిళగ వెట్రి కళగం' పార్టీని స్థాపించి 2026లో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈనెల 22న విజయ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున వేడుకలు నిర్వహిస్తున్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఏ.అప్పు మాట్లాడుతూ.. 2026లో విజయ్ ముఖ్యమంత్రి కావడం తథ్యం అని ధీమా వ్యక్తం చేశారు. తమిళగ వెట్రి కళగం పార్టీకి తమిళ ప్రజలు ఓట్లు వేసి గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని, 365 రోజులు తమ తలైవన్ పుట్టినరోజును జరుపుకునే ఏకైక పార్టీ తమదే అని ఆయన అన్నారు. ఇది విజయ్ పట్ల అభిమానుల ఆరాధనను, వారి రాజకీయ ఆకాంక్షలను ప్రతిబింబిస్తోంది.

**వేల్మురుగన్ విమర్శల దాడి**

అయితే తమిళగ వెట్రి కళగం పార్టీ ఆశలపై తమిళ వాళ్ ఉరిమై పార్టీకి చెందిన వేల్మురుగన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కరుణానిధి పాలనలో పోరాడి రాష్ట్రంలో 36 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చింది తానేనని గుర్తుచేస్తూ ఇప్పుడు రాజకీయాల్లోకి వచ్చిన నటులు తమిళ సమాజానికి చేసిందేమిటని ప్రశ్నించారు. విజయ్ 10, 12వ తరగతి విద్యార్థులను అభినందించడానికి మాత్రమే సమావేశాలు నిర్వహిస్తున్నారని కౌంటర్ ఇచ్చారు. సూపర్‌స్టార్ రజినీకాంత్, విజయకాంత్‌ల కంటే విజయ్ ఏమైనా గొప్పా అంటూ తీవ్రంగా ఫైర్ అయ్యారు. చిన్న నటుడు బాలా స్వయంగా సంపాదించిన డబ్బును పేదలకు సాయం చేస్తుంటే, రాఘవ లారెన్స్ తన సంపాదనలో వృద్ధులు, వికలాంగుల కోసం ఆశ్రమాలను నిర్వహిస్తుంటే.. విజయ్ మాత్రం కేవలం సమావేశాలు మాత్రమే నిర్వహిస్తున్నారని ధ్వజమెత్తారు.

ఈ వివాదం తమిళనాడులో రాజకీయ నాయకులపై, ముఖ్యంగా సినీ నేపథ్యం నుండి వచ్చిన వారిపై ప్రజల అంచనాలను స్పష్టం చేస్తుంది. కేవలం ప్రజాదరణ, అభిమాన బలంతో రాజకీయాల్లోకి ప్రవేశించడం సరిపోదని, సమాజ సేవ, ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడం ముఖ్యమని వేల్మురుగన్ లాంటి నాయకుల విమర్శలు సూచిస్తున్నాయి. రజనీకాంత్, విజయకాంత్ వంటివారు సినీ రంగంలో తమదైన ముద్ర వేయడంతో పాటు, రాజకీయ ప్రవేశానికి ముందు లేదా తరువాత ఏదో ఒక రూపంలో సమాజానికి తమ వంతు సేవ చేశారని కొందరు వాదిస్తుంటారు. విజయ్ రాజకీయ ప్రవేశం ఒక వైపు ఉత్సాహాన్ని నింపుతుంటే, మరోవైపు ఆయన సమాజానికి చేసిన కృషిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కేవలం విద్యార్థులకు అభినందన సభలు నిర్వహించడం ద్వారా ప్రజల సమస్యలను అర్థం చేసుకోలేరని, దీర్ఘకాలికంగా ప్రజలకు మేలు చేసే పనులు చేయాలని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. విజయ్ తన రాజకీయ ప్రయాణంలో ఈ విమర్శలను ఎలా ఎదుర్కొంటారు, ప్రజల విశ్వాసాన్ని ఎలా చూరగొంటారు అనేది వేచి చూడాలి. ఆయన కేవలం సినీ నటుడిగానే మిగిలిపోతారా లేక నిజమైన రాజకీయ నాయకుడిగా ఎదుగుతారా అనేది కాలమే నిర్ణయిస్తుంది.

# ఎల్బీ స్టేడియంలో యోగా డే.. అందరూ పాల్గొనాలని మెగాస్టార్ పిలుపు




హైదరాబాద్ పెన్ పవర్:అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న జరగనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జూన్ 20 హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరగనుంది. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో యోగా డే కార్యక్రమం జరగనుంది. జూన్ 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవం అయితే కౌంట్ డౌన్ గా 20 వ తేదీనే యోగ డే నిర్వహిస్తోంది రాష్ట్ర బీజేపీ. ఈ మేరకు ఎల్బీ స్టేడియంలో జరిగే యోగా డే లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని సినీ హీరో మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియాలో తెలిపారు. చిరంజీవి వీడియోను కిషన్ రెడ్డి షేర్ చేశారు.చిరంజీవి ఏమన్నారంటే.. ప్రతి ఒక్కరు తప్పకుండా డైలీ యోగా చేయాలి. యోగా చేయడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు దరి చేరవు. మన ఆత్మ, శరీరం మన ఆధీనంలో ఉంటాయి. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కౌంట్ డౌన్ గా అంటే జూన్ 20న ఉదయం 6 గంటలకు హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న యోగా కార్యక్రమానికి అందరూ పాల్గొనండి..యోగా చేద్దాం అందరూ ఆరోగ్యం ఉందాం జైహింద్. అని చిరంజీవి పిలుపునిచ్చారు.ప్రపంచానికి భారత్ ఇచ్చిన బహుమతి యోగా అని.. జూన్ 21న అందరం కలిసి సెలబ్రేట్ చేసుకోవాలని చిరంజీవి తన ఎక్స్ లో పోస్ట్ చేశారు. సరిహద్దులు దాటి యోగాను సెలబ్రేట్ చేసుకుందామని చెప్పారు.

# నిర్మలా సీతారామన్ పేరుతో ఫేక్ వీడియో.. హైదరాబాద్ వైద్యురాలికి రూ. 20లక్షలు టోకరా

హైదరాబాద్ పెన్ పవర్:కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ఏఐ ఫేక్ వీడియోతో భారీ మోసాలకు పాల్పడుతున్నారు సైబర్ మోసగాళ్లు. రూ.21 వేలు పెడితే నెలకు లక్షల్లో లాభాలు వస్తాయని నిర్మలా సీతారామన్ చెబుతున్నట్లు ఏఐతో ఓ వీడియో తీసి ఆన్ లైన్ లో పోస్ట్ చేసి బురిడి కొట్టిస్తున్నారు కేటుగాళ్లు. ఈ ఫేక్ వీడియో చూసి ఇటీవలే హైదరాబాద్ రామంతపూర్ కు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి రూ.3.20 లక్షలు పోగొట్టుకున్న సంగతి తెలిసిందే. లేటెస్ట్ గా ఇదే తరహాలో నిర్మలా సీతారామన్ ఫేక్ వీడియోను చూసి పెట్టుబడులు పెట్టిన ఓ మహిళా వైద్యురాలు ఏకంగా రూ. 20 లక్షలు పోగొట్టుకుంది. అసలేం జరిగిందంటే..హైదరాబాద్ కు చెందిన 71 ఏళ్ల ఓ మహిళా వైద్యురాలు ఆన్ లైన్ లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయంటూ నిర్మలా సీతారామన్ చెబుతున్నట్లు ఓ (ఏఐ) వీడియోను సోషల్ మీడియాలో చూసి నమ్మేసింది. ఆ వీడియో లింక్ పై క్లిక్ చేసి , పెట్టుబడికి ఆసక్తి ఉన్నట్లు తెలిపింది. అనంతరం స్కామర్స్ బాధితురాలి వాట్సాప్ కు కాల్ చేసి , రిజిస్ట్రేషన్ కోసం బాధితురాలి ఆధార్ , పాన్ కార్డులు , బ్యాంక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరికాసేపటికి ఫిన్ బ్రిడ్జ్ క్యాపిటల్ ప్రతినిధి అంటూ మరో స్కామర్ కాల్ చేసి , మొదట చిన్న మొత్తంలో 20 వేలు పెట్టుబడి పెట్టాలని సూచించారు. స్కామర్ మాటలను నమ్మి ఆ మొత్తాన్ని పెట్టుబడి పెట్టింది మహిళ. స్కామర్స్ ఫేక్ ట్రేడింగ్ యాప్ లో అధిక మొత్తంలో లాభాలను డాలర్లుగా చూపిస్తూ మహిళ చేత పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టించారు. పలు దఫాలుగా బాధితురాలు మొత్తం రూ. 20,13,305 లను పెట్టుబడి పెట్టింది. అందుకు గాను బిట్ కాయిన్ బ్లాక్ లో %వి%79,850 డాలర్ల లాభాలుగా చూపించారు. బాధితురాలు ఆ డబ్బులను విత్ డ్రా చేయడానికి ప్రయత్నించగా స్కామర్స్ ఇంకా పెట్టుబడి పెట్టాలని ఒత్తిడి చేశారు. దీంతో బాధిత వైద్యురాలు మోసపోయానని గ్రహించి ఆన్ లైన్ ద్వారా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## సముద్రంలో మునిగిపోతున్న జపాన్ ఇంజనీరింగ్ అద్భుత విమానాశ్రయం



హైదరాబాద్ పెన్ పవర్:టెక్నాలజీలో అగ్రగామిగా నిలిచిన జపాన్ మరోసారి ప్రపంచాన్ని తన ఇంజినీరింగ్ అద్భుతంతో ఆశ్చర్యపరిచింది. ఒసాకా బే సముద్రంలో నిర్మించిన కాన్సాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం (%ఖ×శ%) ప్రపంచంలోనే అత్యంత వినూత్నమైన విమానాశ్రయాలలో ఒకటిగా నిలిచింది. 1994లో ప్రారంభమైన ఈ విమానాశ్రయం రెండు మానవ నిర్మిత ద్వీపాలపై ఉంది. ఒసాకా అంతర్జాతీయ విమానాశ్రయంలోని రద్దీని తగ్గించడమే దీని ప్రధాన ఉద్దేశం. 2024 నాటికి 30.6 మిలియన్ల ప్రయాణికులతో 25 దేశాల్లోని 91 నగరాలను కలుపుతూ జపాన్ మూడవ అత్యంత రద్దీ గల విమానాశ్రయంగా రికార్డు సాధించింది.

**తీవ్రమైన సవాలు.. ఊహించని మునిగే వేగం**

కాన్సాయ్ విమానాశ్రయం ఒక తీవ్రమైన సమస్యను ఎదుర్కొంటోంది. నిర్మాణం ప్రారంభించిన 1987 నుంచే ఇది ఊహించిన దానికంటే వేగంగా మునుగుతోంది. 1994లో ఇది ఏటా 50 సెం.మీ. మునిగిపోగా, 2024 నాటికి ఇది సగటున 6 సెం.మీ.కి తగ్గింది. కానీ ఇప్పటివరకు మొత్తం 13.66 మీటర్లు మునిగిపోయింది. 2056 నాటికి ఈ విమానాశ్రయం భాగాలు సముద్ర మట్టానికి దిగువన ఉండవచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ మునిగే సమస్యను ఎదుర్కొనేందుకు 150 మిలియన్ డాలర్లతో సముద్ర గోడలు ఎత్తు పెంచారు. జాక్-అప్ సిస్టమ్, ఇసుక కాలువలు, టెట్రాపోడ్‌ల వంటి పలు పద్ధతులు వినియోగించినప్పటికీ ఆశించిన ఫలితాలు లభించలేదు.

**భవిష్యత్తు సవాళ్లు.. టెక్నాలజీకి పరీక్ష**

సముద్ర మట్టం పెరుగుదల, వాతావరణ మార్పులు కాన్సాయ్ విమానాశ్రయం భవిష్యత్తుపై కొత్త ప్రశ్నలు కలిగిస్తున్నాయి. శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం 2050 నాటికి సముద్ర మట్టం 30-60 సెం.మీ. పెరిగే అవకాశం ఉంది. అయినప్పటికీ, విమానాశ్రయ నిర్వాహకులు మునిగే రేటు ఆమోదయోగ్యమైన స్థాయిలో ఉందని, 609 మిలియన్ డాలర్ల విలువైన టెర్మినల్ 1 పునరుద్ధరణతో భద్రతను మరింతగా పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఇలాంటి నిర్మాణాల ద్వారా ప్రపంచానికి సముద్రంలో మానవ నిర్మిత ద్వీపాల ఇంజినీరింగ్‌పై అమూల్యమైన పాఠాలు లభిస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## తాడేపల్లిగూడెంలో ఎయిర్ పోర్టుకు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్ పెన్ పవర్:ఆంధ్రప్రదేశ్ లో కొత్తగా ఎయిర్ పోర్టుల నిర్మాణంలో భాగంగా తాడేపల్లిగూడెంలో ఎయిర్ పోర్టు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది కేంద్రప్రభుత్వం. రూ. 1570.64 కోట్లను మంజూరు చేస్తూ భూసేకరణకు కేంద్రం ఆదేశించింది. ఈ ఎయిర్ పోర్టు రాకతో పశ్చిమ గోదావరి జిల్లాకు విమాన సదుపాయాలు మరింత పెరగనున్నాయి. ప్రాంతీయ కనెక్టివిటీ మెరుగుపడి, వ్యాపారం, పరిశ్రమలకు ఊతమిస్తుందని చెబుతున్నారు అధికారులు. తాడేపల్లి గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ సహకారంతో ఎయిర్ పోర్ట్ మంజూరయింది. పౌరవిమాన యాన శాఖ మంత్రి రామ్మోహన నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఉడాన్ స్కీం కింద చిన్న విమానాలు, కొంటర్లతో ఈ ఎయిర్ పోర్టు ప్రారంభం కానుందని తెలిపారు. ఇప్పటివకే ప్రాథమిక సర్వేలు, భూసేకరణకు అవసరమైన చర్యలు ప్రారంభమయ్యాయని చెప్పారు బొలిశెట్టి.

# అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన హైడ్రా.. గచ్చిబౌలి FCI సొసైటీలో ఉద్రిక్తత

హైదరాబాద్ పెన్ పవర్:గచ్చిబౌలిలోని ఫర్టిలైజర్స్‌కార్పొరేషన్ఆఫ్ఇండియా ఎంప్లాయిస్? కోఆపరేటివ్ హౌసింగ్‌సొసైటీలో ప్లాట్లు కనిపించకుండా సంధ్య కన్వెన్షన్ యాజమాన్యం రహదారులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారంటూ ప్లాట్ యజమానులు హైడ్రాకు ఫిర్యాదులు చేశారు. దీంతో హైడ్రా,జీహెచ్ఎంసీ అధికారులు జూన్ 17న అక్రమ నిర్మాణాలను కూల్చి వేశారు.ఈ రోజు ఉదయం నుంచి GHMC హైడ్రా అధికారులు FCI లైఅవుట్ లో రోడ్ మ్యాపింగ్ చేపట్టారు. అధికారులు మ్యాపింగ్ చేస్తుండగా వీడియో తీస్తున్న FCI ప్లాట్ యాజమాని సినీ నటి రమ్యశ్రీ, ఆమె సోదరుడు ప్రశాంత్ పై సంధ్య కన్వెన్షన్ యండి శ్రీధర్ బాబు సిబ్బందికి దాడికి పాల్పడ్డారని గచ్చిబౌలి పోలిస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు . కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**మే 6న కూల్చివేతలు**

గచ్చిబౌలి గ్రామం సర్వే నంబర్ 124, 125లో 20 ఎకరాల స్థలం ఉంది. ఇందులో ఫర్టిలైజర్స్?కార్పొరేషన్?ఆఫ్?ఇండియా ఎంప్లాయిస్? కోఆపరేటివ్?హౌసింగ్?సొసైటీ లేఅవుట్ ఉంది. ఇందులో 162 ప్లాట్లు




ఉన్నాయి. ఈ లేఅవుట్?కు ఆనుకొని సంధ్య కన్వెన్షన్?ఉంది. అయితే కొంత కాలంగా ఎఫ్?సీఐ సొసైటీ ప్లాట్ల యజమానులకు, సంధ్య కన్వెన్షన్?ఎండీ శ్రీధర్?రావు మధ్య స్థల వివాదం నడుస్తోంది. హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో ఈ వివాదంపై విచారణ జరుగుతోంది. వివాద భూమిలోనే శ్రీధర్?రావు ఎలాంటి అనుమతులు లేకుండా సంధ్య కన్వెన్షన్?మినీ హాల్, వంట గదులు, రెస్ట్?రూంలు, డ్రెస్సింగ్?రూంలుగా జీ ప్లస్ 2 పద్ధతితో మూడు ఐరన్?షెడ్లను నిర్మించారు. లేఅవుట్ చుట్టూ భారీ ?రేకుల ఫెన్సింగ్?ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ఎఫ్?సీఐ ప్లాట్ల యజమానులు హైడ్రా దృష్టికి తీసుకు వెళ్లారు. తమ ప్లాట్లు గుర్తుపట్టకుండా రోడ్లను, పార్కులను కలుపుతూ అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదు చేశారు. అక్రమ షెడ్ల కోసం సిమెంట్?రోడ్డును నిర్మించారని పేర్కొన్నారు. విచారణ చేపట్టిన హైడ్రా అధికారులు మే 6న భారీ హిటాచీలతో గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్? వద్దకు చేరుకొని అనుమతులు లేకుండా నిర్మించిన సంధ్య కన్వెన్షన్?మినీ హాల్, జీ ప్లస్ 2 పద్ధతితో నిర్మించిన మూడు ఐరన్?షెడ్లను కూల్చివేశారు. ఐరన్? ఫెన్సింగ్?ను, సిమెంట్? రోడ్డును కూడా తొలగించారు. ఇవాళ మరోసారి అక్రమ నిర్మాణాలు కూల్చివేశారు హైడ్రా అధికారులు.

# తమిళనాడు మత్స్యకారుల వలలో విచిత్ర చేప... అపశకునం అంటూ భయాందోళనలు!

హైదరాబాద్ పెన్ పవర్:తమిళనాడు సముద్ర తీరంలో ఓ అరుదైన, వింతైన చేప మత్స్యకారుల వలకు చిక్కడం స్థానికంగా కలకలం రేపింది. సుమారు 30 అడుగుల పొడవున్న ఈ చేపను 'ఓర్ ఫిష్' అని పిలుస్తారు. సముద్ర గర్భంలో అత్యంత లోతున నివసించే ఈ జీవి కనిపించడం చాలా అరుదు. అయితే, ఈ చేప దర్శనం అరిష్టాలకు, ముఖ్యంగా భూకంపాలు, సునామీలు వంటి ప్రకృతి వైపరీత్యాలకు సంకేతమని కొన్ని దేశాల్లో బలంగా నమ్ముతారు. దీంతో, ఈ నెల ఆరంభంలో పట్టుబడిన ఈ 'ప్రళయ చేప' వార్త స్థానికులతో పాటు సోషల్ మీడియాలోనూ తీవ్ర భయాందోళనలకు దారితీసింది.

**వింతైన ఓర్ ఫిష్ - ప్రళయ చేపగా పేరు**

శాస్త్రీయంగా రిగాలెకస్ గ్లెస్నే ( అని పిలువబడే ఈ ఓర్ ఫిష్, సముద్రంలో నివసించే అతిపెద్ద ఎముకల చేప జాతుల్లో ఒకటి. ఇది సాధారణంగా సముద్రంలో 200 నుంచి 1,000 మీటర్ల లోతులో జీవిస్తుంది. దీని వెండి రంగు శరీరం, తలపై ఉండే ఎర్రటి కిరీటం వంటి నిర్మాణం దీనికి ఓ వింత రూపాన్నిస్తాయి. చాలా అరుదుగా కనిపించడం, దాని విచిత్రమైన ఆకారం కారణంగా దీన్ని అనేక ఆసియా



సంస్కృతులలో, ముఖ్యంగా జపాన్, ఆగ్నేయాసియా దేశాల్లో అపశకునంగా భావిస్తారు. అక్కడ దీనిని 'డూమ్స్ డే ఫిష్' లేదా 'ప్రళయ చేప' అని పిలుస్తారు. ఈ చేప కనిపిస్తే భూమి త్వరలో కంపించవచ్చని, లేదా ఏదైనా పెద్ద విపత్తు సంభవించవచ్చని ఓ నమ్మకం ప్రచారంలో ఉంది.

**భయాలు వాస్తవమేనా? శాస్త్రవేత్తలు ఏమంటున్నారు?**

తమిళనాడులో ఈ చేప కనిపించడంతో మత్స్యకారులు, స్థానిక ప్రజలతో పాటు ఆన్‌లైన్‌లో కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ చేపకు సంబంధించిన వీడియో జూన్ మొదటి వారంలో పోస్ట్ చేయగా, అది కాస్తా వైరల్ అయింది. చాలా మంది నెటిజన్లు ప్రపంచం అంతమైపోతుందేమోనని భయపడుతుంటే, మరికొందరు ఇటీవలి ఉద్రిక్తతలు, విపత్తులకు ఈ చేపే కారణమని ఊహాగానాలు చేస్తున్నారు.

అయితే, సముద్ర జీవశాస్త్రవేత్తలు ఈ భయాలను కొట్టిపారేస్తున్నారు. ఓర్ ఫిష్ అత్యంత లోతులో నివసించే చేప అని, అవి గాయపడినప్పుడు లేదా సముద్ర ప్రవాహాల వల్ల దారి తప్పినప్పుడు మాత్రమే ఉపరితలానికి వస్తాయని వారు స్పష్టం చేస్తున్నారు. ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ కు చెందిన డాక్టర్ ఎన్. రాఘవేంద్ర మాట్లాడుతూ, "ఓర్ ఫిష్ కనిపించడానికి, భూకంపాలకు సంబంధం ఉన్నట్లు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవు" అని ధృవీకరించారు. 2019లో పసిఫిక్ మహాసముద్రంలో జరిపిన ఒక సర్వే కూడా ఈ రెండింటి మధ్య ఎటువంటి కార్యకారణ సంబంధం లేదని తేల్చి చెప్పింది.

ఈ అరుదైన సముద్ర చేప ఎదురవ్వడం భవిష్యత్ విపత్తులపై భయాలను రేకెత్తించినప్పటికీ, ఆందోళన చెందాల్సిన శాస్త్రీయ కారణం ఏదీ లేదని నిపుణులు భరోసా ఇస్తున్నారు.